

# అయిందమ్మా పెళ్ళి

అప్పటికి నా వయసు ముప్పయి సంవత్సరాలు దాటింది. ఓ మాదిరి ఉద్యోగం అఘోరిస్తున్నాను. ఆకాలంలో మధ్యతరగతి మానవులకు అది గొప్ప ఉద్యోగం కిందకే వస్తుంది. నా వయసు స్నేహితులందరికి పెళ్ళిళ్ళయిపోయి పిల్లలు కూడ పుట్టుకొచ్చారు. ఆ పిల్లా పీచులు బళ్ళకు కూడ వెళుతున్నారు. కాని నాకు మటుకు పెళ్ళి కాలేదు.

దానికి కారణాలు కర్ణుడి చావుకు లాగా ఎన్నో వున్నాయి.

మాది పార్లమెంటు కుటుంబం ! అందరికీ వీటో హక్కులున్నాయి. ఏ ఒక్కరు కాదన్నా ఏ పనీ జరగదు.

అప్పటికి ఎన్నో సంబంధాలు చూశాను. నాకు నచ్చినవి. మా అమ్మానాన్నలకు - లేదా మా అక్క చెల్లెళ్ళకు నచ్చేవికావు. వాళ్ళకు నచ్చినవి నాకు నచ్చేవి కావు.

అప్పట్లో శ్రీదేవి నా అభిమాననటి ! ఆమెలాంటి చక్కటి రూపం కల భాగస్వామిని వస్తే బాగుంటుందని కలలు కనేవాడిని !

శ్రీదేవి లాంటి అందమైన అమ్మాయికి నాలాంటి మధ్య తరగతి కుటుంబీకుడిని, ఓ మోస్తరు ఉద్యోగస్తుణ్ణి చేసుకునే అవసరం ఏముందని మా స్నేహితులు కూడ ఎగతాళి చేసేవారు! కాని ఆశ చెడ్డది ! మనలోపాలు మనకు తెలియవు కదా! పూర్వ పుణ్యఫలం వలన జగదేక సుందరి వస్తుందని కలలు కనే వయసు అది.

ఏతావాతా ఎన్నో సంబంధాలు చూసి విసిగి వేసారి చివరికి పేపరుకు ఎక్కాను. అంటే 'వధువు కావలెను' అని ప్రకటన యిచ్చుకున్నాను. దానిలో నాకు కావలసిన అన్నికోరికలు రాశాను. ముందస్తుగా ఫోటోతో జాతకంతో సంప్రదించమన్నాను. నా చిరునామా ఇచ్చాను.

వారం తరువాత తపాలాబాబు కట్టల కట్టల ఉత్తరాలు నా మొహాన పడేశాడు. ఒక స్క్రీనింగ్ కమిటీని వేసి వాటిని పరీక్షించాము. కుటుంబ వివరాలు బాగుంటే అమ్మాయిలమొహాలు బాగుండేవి కావు. ఆస్తిపాస్తులుంటే చదువు సంధ్యలుండేవి కావు. అమ్మాయి బాగుంటే ఆమె జాతకం బాగుండేది కాదు. ఇలా ఎన్నో సంబంధాలు వచ్చినా

ఒకటి రెండు తప్ప ఏవీ మా అంచనాలకు తగ్గట్టు రాలేదు. ఆ రెండూ కూడా కొంచెం కోరికలు తగ్గించుకుంటేనే పనికొచ్చేవి, సర్దుకు పోవాలిలాగా ఉన్నాయి.

ఆ కాలంలో ఈ కాలంలో లాగా మొబైల్ ఫోన్లు లేవు - ఆమాటకొస్తే ఎంతో ధనవంతులు-గొప్ప వ్యాపారస్తులు-గొప్ప అధికార హోదా కలిగిన ఉద్యోగులకు మాత్రమే ల్యాండు ఫోనుండేది. స్థిర వాణి అరుదుగా ఉండే కాలంలో చరవాణి గురించి కలలో కూడా ఊహించేవాళ్ళం కాదు! అప్పుడు కేవలం ఆకాశవాణి వినడానికి మాత్రమే మాలాంటి కుర్రకారుకు అవకాశాలుండేవి. టేప్‌రికార్డరు కొనడం కూడ స్టేటస్ సింబలుగా ఉండేది. ఇంకా మడి ఆచారాలు-పెద్దల కట్టుబాట్లు ఉండేవి. పిల్లలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడా ఉండేవి కావు. పుట్టగొడుగుల్లాగా కాన్వెంట్లు ఉండేవి కావు. బ్యాంకు ఉద్యోగం చాలా గొప్ప ఉద్యోగం ! అదే చురుకైన కుర్రకారుకు లక్ష్యంగా ఉండేది. నాదీ ఆ తరహా ఉద్యోగమే!

ఇలా వచ్చిన ఉత్తరాలతో ఉత్తర కుమారుడిలా కుస్తీ పడుతున్నప్పుడు - కారు చీకటిలో కాంతిరేఖలా మాయింటిముందు ఓ రిక్షా ఆగింది. అప్పట్లో ఆటో రిక్షాలు లేవు. జట్కా బండ్లు - రిక్షాలు సాధారణంగా ప్రయాణీకుల వాహనాలు! డబ్బులున్నవాళ్ళే రిక్షాలు ఎక్కేవాళ్ళు.

రిక్షాలోంచి ఒక స్ఫురద్రూపి దిగి 'ఫలానా ప్రసాదు యిల్లు ఎక్కడా?' అని అడిగాడు. అతను బాగా డస్సిపోయినట్లు కనిపించాడు.

కొన్ని ప్రశ్నల తర్వాత ఆయన వెతుకుతున్నది మా యింటికోసమేనని తెల్సుకుని 'నేనే ప్రసాదును' అని చెప్పాను. అతని కళ్ళు మెరిశాయి.

" ఈ రిక్షాకి బాడుగ యిచ్చి పంపండి". అంటూ లోపలికి వచ్చాడు.

వాడెవడో రిక్షా దిగితే నేను బాడుగ యివ్వడమేంటో నాకు అర్థం కాలేదు. అయినా సరేలే అని అర్థరూపాయి యిచ్చి పంపించేశాను.

ఆ శాల్తీ నిదానంగా వివరించాడు.

" అయ్యా ! మీ కోసం నేను వైజాగు నుంచి వస్తున్నాను. నా పేరు అవధాని. ఫలానా పేపరులో ప్రకటన యిచ్చింది మీరే కదా!" అంటూ మేమిచ్చిన 'యాడు' చూపించాడు. అవునని ఒప్పుకున్నాం తప్పదుగా మరి.

" అయ్యా ! మీకోసం కష్టపడి ఇరవైగంటలు ప్రయాణం చేసి వచ్చాను! ఫస్టు క్లాసులో రైల్లో వచ్చాను కాబట్టి - నా ఒళ్ళు హూనం కాలేదు కాని నా దురదృష్టం! రైల్లో నా పర్సు ఎవరో కొట్టేశారు". ఆయాసపడుతూ చెప్పాడు విచారంగా మొహం పెట్టి.

" అయ్యో ! ఎంతుందండి అందులో !" మా నాన్నగారు కంగారు పడ్డారు.

" అయిదువందలు పైనే ఉంది. పోనీలేండి-మనకు ప్రాప్తం లేదు. మిమ్మల్ని చూసి ఈచుట్టుప్రక్కల పుణ్యక్షేత్రాలు దర్శించాలని పెట్టుకొచ్చాను." నిట్టూరుస్తూ చెప్పాడు. ఆ కాలంలో ఐదొందలు అంటే చాలా పెద్ద మొత్తం కింద లెక్క!

" ఇంతకూ తనురు వచ్చిన పని సెలవివ్వలేదు." కాఫీ కప్పు అందిస్తూ మా అమ్మగారు అడిగారు.

" మా ఊళ్ళో కరణం కామేశ్వరరావుగారు మీరిచ్చిన ప్రకటన చూశారు. ఆయనకి పెళ్ళికాని పిల్లలు ముగ్గురున్నారు. పెద్దమ్మాయి మీ వాడికి అన్ని విధాల యోగ్యురాలుగా కనిపిస్తున్నది - ఈ సంబంధం మాట్లాడిరమ్మని - మీగురించి వాకబు చేసిరమ్మని కామేశ్వరరావు గారు పంపితే వచ్చాను." నాకు పరమానందం కలిగింది, అవధాని మాటలు వింటూంటే!

అన్నట్లు ఆ కాలంలో ఈ కాలంలో లాగా లాడ్జీలు అంతగా లేవు. ఆ కల్చరు కూడా లేదు. ఎంతమంది అతిధులు వచ్చినా అవతలి వారి యిల్లు ఎంత చిన్నదైనా అందులోనే సర్దుకునేవారు.

" సరే చాలా దూరం నుంచి వచ్చారు. ముందుగా మీరు స్నానం చేసి ప్రయాణ బడలిక తీర్చుకోండి. అన్నం తిన్న తర్వాత మాట్లాడుకుందాం!" అంటూ నాన్నగారు పనుల నిమిత్తం బయటకు వెళ్ళారు. ఆ రోజు ఆదివారం అయింది.

నేను వరుడిని కనుక ఎక్కువగా ఆసక్తి చూపించకూడదని బింకంగా కూర్చుండిపోయాను. అసలే పెళ్ళికాని ప్రసాదు అని నా మిత్రులు ఆట పట్టిస్తూ ఉంటారు.

ఓ రెండు గంటల తర్వాత అతను స్నానం చేసి, సంధ్యావందనం చేసుకుని భోజనం చేసిన తర్వాత సంచీలోంచి కవరు బయటకు తీశాడు. కవరులోంచి ఒక పాసుపోర్టు ఫోటో ఇంకో పెద్ద ఫోటో తీశాడు. ముందు మా అమ్మకిచ్చాడు. ఆమె చూసి మానాన్న కిచ్చింది. ఆయన మా అక్కకు యిచ్చాడు. ఆమె మా చెల్లెలికిచ్చింది. ఆమె చూసి నాకిచ్చింది.

ఫోటో చూడగానే బమ్మెరపోతన లాగా దిమ్మెరపోయాను. అమ్మాయి సినిమా నాయికలాగా చాలా చక్కగా ఉంది. ఏవంకా లేని నెలవంక లాగా చూపరులను వంకరలు తిరిగేట్లు చేస్తున్నది. ఇంక నేనెంత !

" పేరు రాధ! ఆయనకి వంద ఎకరాల సుక్షేత్ర మాగాణి ఉంది. ముగ్గురూ ఆడపిల్లలే! ఆయన తదనంతరం ఆస్తి ఆడపిల్లలకే దక్కేది."

" కట్నం ఎంతిస్తారు ?" మానాన్నగారి ప్రశ్న. మధ్యతరగతి మనస్తత్వం !

" బంగారం ఎంత పెడతారు?" మా అమ్మ అనుమానం, మరి నలుగురిలో గొప్పగా ఉండాలిగా.

" ఏవన్నా చదువుకుందా?" మా అక్క అడిగింది. తన కెందుకో ! ఛీ. "వంట గింటా – పనీపాటా వచ్చా!" మా చెల్లెలు చొప్పదంటు ప్రశ్న.

నాకు చిర్రెత్తుకొస్తున్నది. ఈ సిరిసంపదలు శాశ్వతాలా! ఇరవై నాలుగు కేరట్ల బంగారం లాంటి అమ్మాయి మనింటికి వస్తూంటే యివన్నీ ఆలోచించాలా! ఫోటో చూడగానే నేను క్లీన్ బౌల్డు అయిపోయాను.

" అయ్యా ! అవన్నీ మీరు అడగాలా! వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు ! వాళ్ళ ఊరిలో వాళ్ళే మోతుబరి రైతులు ! వారి హోదాకు తగ్గట్టు అన్నీ ఘనంగా యిస్తారు – వైభవంగా పెళ్ళిచేస్తారు–ఆ అనుమానాలు అక్కరలేదు–ఎటొచ్చి వాళ్ళకు జాతకాలంటే నమ్మకం జాస్తి. మీ అబ్బాయి జాతకంతోపాటు ఒక చిత్తర్వుకూడా యిస్తే ఆపైన ఆలోచిస్తారు" చెప్పాడు.

" అవధానిగారు – ఈ కాలంలో జాతకాలు ఎవరు నమ్ముతున్నారు?" కంగారు పడుతూ చెప్పాను ఎక్కడ జాతకం నప్పలేదంటాడేమోనని భయపడ్తూ.

" తమరికి లేక పోవచ్చు. వాళ్ళు కరణాలు! కారణం లేకుండా చేసుకోరు. కనీసం పద్దెనిమిది లక్షణాలు కలవాలి !" అవధాని చెప్పాడు నిదానంగా.

" తిక్కవెధవా నోర్మూసుకోరా! జాతకం లేనిది మనం మటుకు ఎలా చేసుకుంటాం." నాన్న కసిరారు ఆయన ముందే ! చిన్నబుచ్చుకున్నాను.

" దాందేముంది లేండి – జాతకం కుదరకపోతే మాకూ ఈ సంబంధం వద్దు – రేపు కాపురం బాగుండాలి గదా – మాకూ అచ్చిరావాలి !" అమ్మ చెప్పింది.

" జాతకం పట్టి సగం అమ్మాయి గుణగణాలు చెప్పచ్చు." అక్క చెప్పింది.


" అస్సలు ఆమెకాలు ఎలాంటిదో – ఇనుప పాదమా–కాదా తెలుస్తుంది." చెల్లి వివరించింది.

నాకు చాలా కోపం వచ్చేస్తున్నది. ఎద్దులాంటి మొగాడికి పెళ్ళి చేయాలన్న ధ్యాస వీళ్ళకి లేదు కాని – జరుగుతాయో జరుగవో తెలీని జాతకాలు గురించి చర్చిస్తున్నారు. చదువుకున్న మూర్ఖులు ! ఛ !

" అవధాని గారు ! అమ్మాయి జాతకం తెస్తే నాకివ్వండి – చిటికలో కుదురుతుందో లేదో చెప్పేస్తాను." అంటూ లోపలికి పోయి పంచాంగం పట్టుకొచ్చాను, ఆదుర్దా ఆపుకోలేక.

అదురుతున్న గుండెలతో ఆమె జాతకం పట్టుకుని పంచాంగంలోని కొన్ని పేజీలు తిరగవేశాను. 'హమ్మయ్య' కుదిరింది. చచ్చినట్టు జాతకం కుదిరింది. పెద్ద అడ్డంకి అధిగమించాను.

ఆ అడ్డంకి తొలగింతర్వాత అవధాని అమ్మాయి వినయ విధేయతలు వర్ణించి చెప్పాడు. నాకైతే స్వర్గంలోకి అడుగు పెడుతున్నట్లు అనిపించింది.


మీ రెంత దోచుకున్నా! మీపేరు పేపర్లలో...!
టీ.వీ లో రాదేంటే!? వా...వా!!


అడ్రసు చెబుతా వచ్చేయరా! సెంటర్లో
దిగి లెఫ్టుకి చూడు బార్ వుంది, బార్ కి
లెఫ్టున సందులోకి రా! లెఫ్టున వున్న
నాల్గోయిల్లే నాది.. వచ్చేయ్!!
ఏవిఎమ్


సలహాలు
"పత్రిక"
మనమ్మాయే..పేరు మార్చి అడిగితే..
ఇలా..గుళ్ళో పెళ్ళి చేసుకోమని..
బోడిసలహా ఇచ్చారంట!
ఏవిఎమ్.

" అయ్యో ! వారు కామేశ్వరరావు గారు స్వయంగా వస్తే బాగుండేది!" అమ్మ చెప్పింది. ఆ మాటలు విని ఆనందపడుతూ.

" వచ్చే వారే జమాబందీ ఉన్నదిట - తనకు తీరిక కావడానికి ఇంకో పది రోజులు పడుతుందట - ఈలోగా నన్ను పంపించారు చూసి రమ్మని ఖర్చులిచ్చి".

అవధాని మాదగ్గిరనుండి నాఫోటో, జాతకం, వివరాలు తీసుకొన్నాడు. "మంత్రాలయం దర్శించి వెళతాను. తర్వాత ఎలాగూ మీ పెళ్ళయింతర్వాత అడపాదడపా రావాలి కనుక అప్పుడు మిగతా క్షేత్రాలు దర్శించుకుంటాను." అవధాని చెప్పాడు నా మనసుకు తియ్యగా.

" అవధానిగారు - అమ్మాయిని చూడటానికి మేము ఎప్పుడు రావాలి! ఇప్పుడు మీ వెంట రమ్మంటారా?" నేను ఆతృతగా అడిగాను.

నా సిగ్గులేని తనానికి మిగిలిన నలుగురూ కోపంగా చూశారు నా వంక.

" వద్దు బాబు - వద్దు - కరణంగారు జాతకాలు చూసుకుని వాళ్ళ పెద్దలతో చర్చించిన తరువాత ఉత్తరం రాస్తారు. అప్పుడు మీరందరూ కార్లో రండి".

" అబ్బో ! కారంటే మాటలా - బోల్డు ఖర్చు !" నాన్నాగారు భయపడ్డారు.

" మీకేం నెప్పి ! అదంతా కరణంగారు భరిస్తారు - మీరొస్తే చాలు !"

దాంతో మా మొహాలు వికసించాయి.

వచ్చిన పని అయింది. అవధాని వెళ్ళడానికి సిద్ధమయ్యాడు - వెళ్ళొస్తా నంటున్నాడు కాని - ఆసనంలోంచి లేవడం లేదు. అటూ యిటూ చూస్తున్నాడు.

అమ్మ యింకోసారి కాఫీ కూడ యిచ్చింది యింక పోయిరమ్మని. " రిక్షా పిలవ మంటారా?" అడిగాను.

చివరికి అవధాని మొహమాటం విడిచి బయటపడ్డాడు.

" అయ్యా ! మీకు ముందే మనవి చేశాను. నేను వస్తూంటే రైల్లో నా పర్సు కొట్టేశారు. నా దగ్గర చిల్లికాని లేదు. తిరుగు ప్రయాణానికి ఖర్చులిప్పిస్తే --" నసిగాడు.

మేము మొహా మొహాలు చూసుకున్నాం! నాన్నగారికి కోపం వచ్చింది. "పెళ్ళి కాకుండానే ఖర్చులు అంటే ఎలాగండి ?"

" అయ్యా ! తమరు ఊరికే యివ్వద్దు. మీరిస్తే ఊరికి పోగానే నేను మీకు టి.యం.ఓ చేస్తాను" వినయంగా చెప్పాడు.

" ఓ యాభై యిమ్మంటారా?" నాన్న విసుగ్గా అడిగాడు రైలుఖర్చులు లెక్కపెట్టుకుని. డబ్బు విషయంలో ఆయన మహా గడసరి.

" కరణం గారి హోదాకు, మీ హోదాకు తగ్గట్టు నేను ఫస్టుక్లాసులోనే ప్రయాణం చెయ్యాలి. ఈ థర్డు క్లాసు ప్రయాణాలు నా వంటికి సరిపడవు. ఓ ఐదొందలు సర్దండి.

ఊరికి పోగానే పంపుతాను." అవధాని చెప్పాడు

నవ్వుతూనాన్న ధాంధూం అంటూ లోపలికి వెళ్ళారు - నేనూ వెళ్ళాను.

" వాడొట్టి మోసగాడి లాగున్నాడు-అంత డబ్బు మనమెందుకివ్వాలి ?" నాన్న.

" ఎంతటి వారికైనా కష్టం రావచ్చు. బాగా బ్రతికినట్లున్నాడు- ఓ రెండొందలు యివ్వండి. ఎలాగూ యంవో చేస్తాడుగా" అని నేను సర్ది చెప్పాను.

కాసేపటికి ఓ రెండొందలు ఆయన చేతికిచ్చి సాగనంపాము.

నాన్న మా అడ్రసు యిచ్చి - యంవో ఫారం కూడా పూర్తి చేసి యిచ్చారు వెళ్ళగానే పంపమని.

" మా ప్రయాణానికి కూడా సిద్ధంగా ఉండమని" చెప్పి మరీ వెళ్ళాడు అవధాని. నేను కలల్లో విహరిస్తూ కాలం గడిపాను. గర్వంగా కాలరు ఎగరేస్తూ తిరిగాను. పదిరోజులైంది-నెల తిరిగింది. మాకు ఎటువంటి యంవోగాని, ఉత్తరం కాని రాలేదు. అతనిచ్చిన కామేశ్వరరావు అడ్రసుకు పోస్టుచేసిన లెటరు తిరిగొచ్చింది. 'అటువంటి వ్యక్తి లేడ'ని ఆకాలంలో రెండొందలు అంటే చాలా ఖరీదైన సొమ్ము. కొంత బంగారం వచ్చేది.

అందరం చదువుకున్న వాళ్ళం - తెలివిగల వాళ్ళమన్న ఆత్మ విశ్వాసంతో బ్రతికేవాళ్ళం! ఇరుగు పొరుగును పురుగులులాగా చూసే వాళ్ళం -

అటువంటిది వాడెవడో అవధాని మా యింటికొచ్చి -

మా యింట్లో భోంచేసి -

ఆశల పల్లకిలో ఊరేగించి -

తిన్న యింటి వాసాలు లెక్కపెట్టి -

డబ్బులు పట్టిగ్గా కొట్టేసి ఉడాయించాడు -


ఆసంబంధం కుదురుతుందని నేను ఎంతోకాలం ఎదురుచూశాను మూర్ఖుడిలాగా.

అవన్నీ తలచుకుంటే యిప్పటికీ నవ్వు ఆగదు.

కోరికలే కొంపలు ముంచుతాయని అనుభవంతో తత్త్వం బోధపడింది. పెళ్ళి ఎప్పుడైందంటారా - అదంతా పెద్ద కథ - ఇప్పుడెందుకు లేండి !

- ఆంధ్రప్రభ 4-12-2011


-హాస్యబిందువులు సంకలనం


ఈ క్రికెట్ స్టేడియంని
జైలుగా మార్చండి!!
రేపు ఏదన్నా స్కామ్ లో
మీరుంటే! మీకు, మీ
బంధువులకు బాగా
సౌకర్యంగా వుంటుంది!!
AVM


2 G స్కాం నుంచి
వీరిపేరు తప్పించా
రంట! అదే
'సంతోషం!!
AVM


ఫర్నిచర్ షాపు
సచివాల
సచివాలయంలో
పోయిన వస్తు
అమ్మబడును
AVM


నేను ఎప్పుడూ గుప్తదానమే చేస్తా! రాసుకోండి
ఐదురూపాయలు! ఎవ్వరికీ చెప్పకూడదు మరి!!
AVM
ప్రసాదం కొనగానే! ముందు భిక్షగాళ్ళకి వేస్తున్నారు! మీదెంత మంచి.....
పిచ్చిదానా! వాళ్ళు తిని బాగుంటేనే!... మనమూ తినొచ్చని!
AVM
నీకన్నా...నీకొడుకే క్షేమంలో వుండేడే! సేల్సు బాగా పెరిగింది అన్నావు గదా! వాడికి వందకి ఐదొందలకీ తేడా తెలియదన్న సంగతి కస్టమర్లకు తెలిసింది!!
AVM
జనరల్ స్టోర్స్


అమ్మగారూ! రేపే నా పెళ్ళి! రేపు వస్తాం
హారతులు రెడీగా వుంచండి! వచ్చేది...
మీ కోడలిగా!!
AVM


ఇంట్లో సామానంతా! ఏదీ!?
నాలో వున్న తామస గుణాన్ని తగ్గించి, సత్వగుణాన్ని పెంచమూ! అన్నారుగా! అన్నీ దానంచేశా!
AVM


గుడ్‌లక్! తల మీద తగిలిన బలమైన గాయం వలన.. మెమొరీ లాసయ్యి..... ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయారు!
ICU
మంత్రి
ఏవిఎమ్.